క్లుప్తంగా

'సాయి ప్రూడెంట్ టెస్ట్'కు స్పందన


పరీక్షకు హాజరైన విద్యార్థులు

ప్రశాంతి నిలయం: పుట్టపర్తి సమీపంలోని బీడుపల్లి వద్ద ఉన్న సంస్కృతీ విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఉచిత ఇంజినీరింగ్ విద్యను అందించేందుకు ఆదివారం సాయి ప్రూడెంట్ టెస్ట్ నిర్వహించారు. ఉదయం 10 గంటలకు సంస్కృతీ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన పరీక్షకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ఇంటర్ ఎంపీసీ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు భారీగా హాజరయ్యారు. పరీక్ష పేపర్లను మూల్యాంకనం చేసి, త్వరలోనే మెరిట్ లిస్ట్‌ను విడుదల చేస్తామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సెంథిల్ కుమార్ తెలిపారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష' షెడ్యూల్ విడుదల

అమడగూరు: మండలంలో రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో వైద్య శిబిరాల నిర్వహణకు అధికారులు షెడ్యూల్ విడుదల చేశారు. ఈనెల 2వ తేదీన చీకిరేవులపల్లి, 9న జౌకలకొత్తపల్లి, 23న గుండువారిపల్లి, 30న కస్సముద్రం, ఫిబ్రవరి 6న మహమ్మదాబాద్, 13న చినగానిపల్లి, 20న పూలకుంటపల్లి, 27న తుమ్మల గ్రామ సచివాలయాల పరిధిలో వైద్య శిబిరాలు జరగనున్నాయి.

ముదిగుబ్బ ఎంపీడీఓగా కవిరాజు


ఎంపీడీఓ కవిరాజును సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ముదిగుబ్బ: ముదిగుబ్బ మండలం ఎంపీడీఓగా కవిరాజ్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పార్టీ మండల కన్వీనర్ సీపీ నారాయణరెడ్డి, ఈదులపల్లి సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ భాస్కర్ తదితరులు ఎంపీడీఓను మర్యాదపూర్వకంగా కలిశారు. పూలమాలలు వేసి సన్మానించారు. ఇది వరకు ఇక్కడ ఇన్‌చార్జ్‌గా విధులు నిర్వహిస్తున్న ఎంపీడీఓ విజయలక్ష్మి స్థానంలో నూతనంగా కవిరాజ్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ఇటీవల తాను గ్రూప్–1లో ఉత్తీర్ణత సాధించడంతో విజయవాడలో నెల రోజుల పాటు శిక్షణ తీసుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను అర్హులకు అందేలా కృషి చేస్తామన్నారు.

రామాలయ నిర్మాణానికి కృషి


సత్యసాయి భక్తులను సన్మానించిన గ్రామస్తులు

పుట్టపర్తి అర్బన్: మండలంలోని బత్తలపల్లి గ్రామంలో ఆగిపోయిన రామాలయ నిర్మాణ పనులు పూర్తి చేయించేందుకు పలువురు సత్యసాయి బాబా భక్తులు ముందుకొచ్చారు. ఇటీవల పురాతన రామాలయాన్ని జీర్ణోద్ధరణ చేశారు. కొత్తగా నిర్మిస్తున్న ఆలయ నిర్మాణ పనులు ఆగిపోవడంతో ఆదివారం పలువురు భక్తులు విచ్చేసి ఆలయాన్ని పరిశీలించారు. నిర్మాణ పనులు పూర్తి కావడానికి రూ.2 లక్షలకు పైగా ఖర్చు అవుతుందని కమిటీ సభ్యులు తెలిపారు. దీంతో తామే ఖర్చు భరించి నిర్మాణ పనులు పూర్తి చేసి విగ్రహాన్ని ప్రతిష్టిస్తామని వెల్లడించారు. అంతకుముందు గ్రామానికి విచ్చేసిన బాబా భక్తులను గ్రామంలో ఊరేగించి పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో సత్యసాయి బాబా బంధువు కొండమ రాజు, లాయర్ హరికృష్ణ, డాక్టర్ రాఘవేంద్ర, భాస్కర్‌రెడ్డి, హరి, చంద్ర, టాచర్ రాజవర్ధన్ రెడ్డి, గోవిందరెడ్డి, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో నిఘా పెంచండి


మాట్లాడుతున్న సీఐ వెంకటేశ్వర్లు

గాండ్లపెంట: రాబోయే సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా గ్రామాల్లో నిఘా పెంచాలని కదిరి రూరల్ సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. గ్రామాల్లో శాంతి భద్రతల పరిస్థితి, ట్రబుల్‌మాంగర్స్, రౌడీషీటర్స్, మండల సమగ్ర వివరాలను ఎస్ఐ వెంకటనారాయణను అడిగి తెలుసుకున్నారు. పోలీసులు గ్రామాలపై నిఘా పెంచాలని.. అదే సమయంలో గ్రామాల్లో ఎవరైనా కొత్త వ్యక్తులు తిరుగుతున్నారా అని ఆరా తీయాలన్నారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఉండేలా సిబ్బంది సమన్వయంతో పని చేయాలన్నారు. అనంతరం ఈనెల 2, 3 తేదీల్లో ఇస్తెమా నిర్వహించే స్థలాన్ని పరిశీలించారు. వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా సిబ్బందిని నియమించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూడాలని ఆదేశించారు.

సచివాలయాలతో సత్వర సేవలు

- ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి
- బూరుగుపల్లిలో సచివాలయ భవనం ప్రారంభం


బూరుగుపల్లిలో నూతన సచివాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి

కదిరి అర్బన్: సచివాలయాలతో ప్రభుత్వ సేవలు ప్రజలకు సత్వరం అందుతున్నాయని ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని బూరుగుపల్లిలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాదయాత్రలో ప్రజలకు సత్వర సేవలు అందిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఆ హామీ మేరకు సచివాలయాల వ్యవస్థను తీసుకువచ్చి సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. ఈ సచివాలయాలతో పాటు వలంటీర్ వ్యవస్థను తీసుకువచ్చి ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవలు అందజేస్తున్నారని చెప్పారు. ఈ వ్యవస్థతో దాదాపు 4 లక్షల మందిదాకా చదువుకున్న నిరుద్యోగులకు వారి గ్రామంలోనే ఉద్యోగాలు కల్పించారని పేర్కొన్నారు. లబ్ధిదారులకు రూ.2 లక్షల కోట్లు నేరుగా వారి ఖాతాల్లో జమ చేశారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ అమరనాథరెడ్డి, సర్పంచ్ భాస్కర్, మండల కన్వీనర్ ప్రకాష్, నాయకులు మధుసూదన్ రెడ్డి పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం..


కదిరిలో ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డిని సత్కరిస్తున్న బంజారా సంఘం సభ్యులు

కదిరి టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ బంజారాల అభివృద్ధికి అనేక కార్యక్రమాలను చేపట్టారని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి తెలిపారు. ఆదివారం ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం సభ్యులు ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బంజారా సంఘం సభ్యులు అడిగిన వెంటనే 44 సెంట్ల ప్రభుత్వ భూమిని అధికారికంగా కేటాయించడం హర్షించదగ్గ విషయమన్నారు. భవిష్యత్‌లో కూడా బంజారాల అభివృద్ధికి తన వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. ప్రభుత్వ భూమిని కేటాయించడానికి సహకరించిన ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డికి రుణపడి ఉంటామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విశ్వదీప సేవా సంఘం సేవలు అమూల్యం


కేక్ కట్ చేస్తున్న ఇస్కాన్ మందిరం గురువు, విశ్వదీప సేవా సంఘం సభ్యులు

ధర్మవరం అర్బన్: విశ్వదీప సేవా సంఘం సేవలు అభినందనీయమని ధర్మవరం ఇస్కాన్ మందిరం గురువు కృష్ణ మాధవదాస్ తెలిపారు. పట్టణంలోని శాంతినగర్‌లో విశ్వదీప సేవా సంఘం 11వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఇస్కాన్ మందిరం గురువు కృష్ణమాధవ్‌దాస్ చేతులమీదుగా కేక్ కట్ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విశ్వదీప సేవా సంఘం అనేక సేవా కార్యక్రమాలు చేస్తుండటం హర్షణీయమని కొనియాడారు. కుట్టు శిక్షణ, కంప్యూటర్ శిక్షణను ఉచితంగా అందిస్తూ వారి జీవనోపాధికి ఆసరాగా నిలుస్తోందని తెలిపారు. మృతి చెందిన వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి నేత్రదానాలు చేయిస్తున్నారని పేర్కొన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెన్నో చేపట్టాలని ఆకాక్షించారు. కార్యక్రమంలో విశ్వదీప సేవా సంఘం వ్యవస్థాపకుడు కోళ్లమొరం చంద్రశేఖర్‌రెడ్డి, అధ్యక్షుడు గాజుల సురేష్, కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, సలహాదారుడు లక్ష్మీనారాయణ, సభ్యులు ప్రభాకర్‌రెడ్డి, రఘు, ఓబులమ్మ, కేశవరెడ్డి, ఆదినారాయణ, మధునాయుడు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోండి


బత్తలపల్లి: మాట్లాడుతున్న ఎంపీడీఓ సాయిమనోహర్


లక్ష్మీచెన్నకేశవపురంలో పథకాలను వివరిస్తున్న మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న

ధర్మవరం అర్బన్: కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న తెలిపారు. పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవపురంలో ఆదివారం వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, 25, 26 వార్డుల కౌన్సిలర్లు మేడాపురం వెంకటేష్, రాయపాటి మంజుల, డాక్టర్ సురేష్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. పేద ప్రజల కోసం కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని తెలిపారు. పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పీఎం జనారోగ్య యోజన, జన్‌ధన్ యోజన, సురక్ష బీమా యోజన, జీవనజ్యోతి బీమాయోజన, అటల్ పెన్షన్ యోజన తదితర పథకాలను కేంద్రం అందిస్తోందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఆర్ఓ ఆనంద్, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జ్ రాయపాటి రామకృష్ణ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లి: మండలంలోని దంపెట్ల, గరిశలపల్లి గ్రామ సచివాలయాల ఆవరణలో సర్పంచులు చల్లా కరుణాకర్‌నాయుడు, మాదిరెడ్డి పద్మావతి అధ్యక్షతన 'వికసిత్ భారత్ సంకల్పయాత్ర' కార్యక్రమంలో భాగంగా గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ సాయిమనోహర్ మాట్లాడుతూ.. ప్రజల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను ఇంటి ముంగిటకే అందిస్తోందన్నారు. అర్హులందరూ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం నూతన సంవత్సరం క్యాలెండర్లను విడుదల చేశారు. గ్రామసభలో వైద్య ఆరోగ్య శిబిరంతో పాటు వంటగ్యాస్‌పై కౌంటర్లు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ దివాకర్, వైద్యాధికారి రామకృష్ణ, సీహెచ్ఓ రాజశేఖర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వరలక్ష్మి, ఏపీఎం సుదర్శన్‌రాజు, ఏఓ ఓబిరెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ చంద్రమ్మ, బీజేపీ నాయకులు గంగులకుంట గోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

2024కు ఘన స్వాగతం


బత్తలపల్లిలో బేకరీ వద్ద కేక్ కొనుగోలు చేస్తున్న ప్రజలు


కదిరి వేమారెడ్డి కూడలిలో కేక్ కట్ చేస్తున్న దృశ్యం


బత్తలపల్లిలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న కేక్‌లు

కదిరి/బత్తలపల్లి: కదిరి, బత్తలపల్లిలో ఎవరినోట విన్నా హ్యాపీ న్యూ ఇయర్ అన్న మాటలే వినబడ్డాయి. డిసెంబర్ 31 అర్ధరాత్రి 12 గంటలు కాగానే కదిరి పట్టణంలోని యువత ఒక్క సారిగా కేరింతలు కొడుతూ హ్యాపీ న్యూ ఇయర్ అంటూ రోడ్లపైకి వచ్చింది. న్యూఇయర్ శుభాకాంక్షలు చెబుతూ ఆనందంలో మునిగిపోయారు. పోలీసులు సైతం పట్టణ ప్రజల ఆనందంలో భాగస్వాములయ్యారు. నూతన సంవత్సరం సందర్భంగా ఎక్కడ చూసినా కేక్‌లు కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. స్థానిక వేమారెడ్డి కూడలిలో కాస్త ముందే నూతన సంవత్సర వేడుకలు మొదలెట్టారు. అన్ని ప్రధాన కూడళ్లలో పెద్ద ఎత్తున బాణాసంచా పేల్చి పట్టణ ప్రజలు 2023 సంవత్సరానికి గుడ్‌బై చెప్పి 2024 నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. వీధుల్లో సైతం వయసులో నిమిత్తం లేకుండా యువకులతో పాటు చిన్నారులు, మహిళలు కేక్‌లు కట్ చేసి ఆనందంలో కన్పించారు. బత్తలపల్లి కూడలిలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం మండల అధ్యక్షుడు, ఎంపీటీసీ సభ్యులు కోటి నరేష్‌కుమార్, ఉప సర్పంచు కోటి గోపీనాథ్ యువకులతో కలిసి కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. ఆర్డీటీలో సైతం కొత్త సంవత్సర వేడుకలను వైభవంగా జరుపుకున్నారు.

గుండెపోటుతో వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి


హుస్సేన్ పీరా మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి

ముదిగుబ్బ: మండల కేంద్రానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త సరితాల హుస్సేన్ పీరా ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం హుస్సేన్ పీరా మృతదేహానికి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అధైర్యపడొద్దని.. కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

బత్తలపల్లి: నూతన సంవత్సర వేడుకలు, సంక్రాంతి పండుగ సమయాల్లో హద్దు మీరి ప్రవర్తిస్తే ఎంతటి వారైనా కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ శ్రీనివాసులు హెచ్చరించారు. ఆదివారం పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. బత్తలపల్లి పరిధిలో ఎలాంటి సంఘటనలకు తావులేకుండా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. నిబంధనల మేరకు మద్యం షాపులు, హోటళ్లు, దుకాణాలు, వ్యాపార సంస్థలు, నిర్ణత సమయాల్లోనే మూసివేయాలన్నారు. రహదారులపై కేక్ కటింగ్‌లు చేయడం నిషేధమన్నారు. మద్యానికి అనుమతి లేని ప్రదేశాల్లో మత్తు పానీయాలు సేవించినా, అందుకు ఏర్పాట్లు సమకూర్చినా చట్టపరంగా చర్యలు తప్పవన్నారు. డ్రంకన్ డ్రైవ్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామన్నారు. మద్యం మత్తులో వాహనాలు నడపటమే కాకుండా వాటికి సంబంధించిన సైలెన్సర్లు తొలగించి అధిక శబ్దాలతో ఇతరులను ఇబ్బంది పెడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. బైక్ రేస్‌లు, ట్రిపుల్ రైడింగ్, మైనర్ల రైడింగ్‌పై కూడా ప్రత్యేక దృష్టి సారించి ఆ వాహనాలను సీజ్ చేసి కఠినమైన సెక్షన్ల కింద కేసు నమోదు చేస్తామన్నారు. మద్యం మత్తులో ప్రైవేట్, ప్రభుత్వ ఆస్తులకు నష్టం చేకూరిస్తే ఉపేక్షించేది లేదన్నారు. ప్రజల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని అందరూ పోలీసులకు సహకరించాలని కోరారు.

పెద్దమ్మ దేవతకు పూజలు

తాడిమర్రి: స్థానిక పెద్దమ్మ తల్లి ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా ఆలయ పూజారి బండారు దేవమ్మ అమ్మవారి మూలవిరాట్‌కు వెండి ఆభరణాలు తొడిగి, పలు రకాల పుష్పాలు, పూలమాలలతో అలంకరించారు. అనంతరం అమ్మవారికి పూజలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

వ్యాసరచన పోటీల్లో ప్రతిభ


బహుమతులు అందుకున్న విద్యార్థులతో సత్యసాయి సేవా సంస్థల ప్రతినిధులు

పుట్టపర్తి టౌన్: సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నత పాఠశాల, ఇంటర్, డిగ్రీ కళాశాల విద్యార్థులకు శ్రీఆచార్య దేవోభవ, ప్రకృతే ఉత్తమ గురువు, మానవత్వం పెంపొందించడంలో విద్యార్థుల పాత్ర అనే అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన 45 మంది విద్యార్థులకు ఆదివారం కొత్తచెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కొత్తచెరవు సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ మూర్తి, ఉపాధ్యాయులు ఈశ్వరప్ప, ఆదినారాయణ, లక్ష్మీదేవి, వెంకటరత్నం, వెంకటాద్రి, బాబు తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ


మహిళకు దుప్పటి అందజేస్తున్న దృశ్యం

కదిరి అర్బన్: పట్టణంలో సుమారు 75 మంది యాచకులు, నిరాశ్రయులకు ఆదివారం శ్రీ శాంతినికేతన్ ఇంగ్లిష్ మీడియం పాఠశాల అధినేత మెమిన్ సలీంబాషా దుప్పట్లు పంపిణీ చేశారు. ఏటా డిసెంబర్ నెలలో నిరాశ్రయులు, యాచకులకు దుప్పట్లు పంపిణీ చేస్తామని ఆయన తెలిపారు.

టీడీపీ కనుమరుగు ఖాయం


ఎమ్మెల్యే కేతిరెడ్డి సమక్షంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన ముదిగుబ్బ మండలం గుంజేపల్లి పంచాయతీ వాసులు

- ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి
- వైఎస్సార్‌సీపీలో చేరిన ఆర్యవైశ్య సంఘం ముదిగుబ్బ ఉపాధ్యక్షుడు క్రిష్ణయ్య, గుంజేపల్లి పంచాయతీ వాసులు

ధర్మవరం: రానున్న రోజుల్లో టీడీపీ కనుమరుగవుతుందని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం ఎమ్మెల్యే తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆర్య వైశ్య సంఘం ముదిగుబ్బ ఉపాధ్యక్షుడు క్రిష్ణయ్య, ముదిగుబ్బ మండలం గుంజేపల్లి పంచాయతీ పరిధిలో పలువురు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి వైఎస్సార్‌సీపీ కండువాలు వేసి, సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో క్రిష్ణయ్యతో పాటు నాగభూషణ, రమణారెడ్డి, రమణ, నడిపి ఓబిలేసు, సతీష్, రాజు, బాష, మల్లి, రాఘవేంద్ర, నాగరాజు, నాగోజీ, గోపాల్, వెనుగుంట్ల పుల్లయ్య, ఆదిమూల నాగరాజు, నరసింహులు తదితరులు ఉన్నారు. అనంతరం ఎమ్మెల్యే కేతిరెడ్డి మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమం సమపాళ్లుగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జనరంజక పాలన అందిస్తున్నారన్నారు. పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమాన్ని అందించి ప్రజల మన్ననలు పొందడం జరిగిందన్నారు. సమష్టిగా కృషి చేసి రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని అఖండ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ఇందుకూరు నారాయణరెడ్డి, రామకృష్ణ, గుంజేపల్లి సర్పంచ్ శివశంకర్, ఎంపీటీసీ నాగప్ప, జేకేపల్లి మనోహర్ రెడ్డి, మాధవ్‌రెడ్డి, బాల భాస్కర్, హరినాథ గుప్తా పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు

రామగిరి: నసనకోట సమీపంలోని ముత్యాలమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారిని ప్రత్యేకంగా వివిధ రంగుల పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఈపూజల్లో ఉమ్మడి జిల్లా వాసులే కాక, కర్ణాటక నుంచి వందలాది మంది భక్తులు పాల్గొని, అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రతి మంగళ, శుక్ర, ఆదివారాల్లో దేవదాయశాఖ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ వెంకటేశ్వర్లు తెలిపారు.

వృద్ధురాలికి తీవ్ర గాయాలు



కదిరి టౌన్: పట్టణంలోని వాణి వీధిలో ఉన్న షిర్డీ సాయి బాబా కాలనీకి చెందిన వృద్ధురాలు గంగులమ్మ తీవ్రంగా గాయపడింది. వివరాలు.. ఆదివారం వేమారెడ్డి సర్కిల్‌లో రోడ్డు దాటుతుండగా ప్రమాదవశాత్తూ ఆర్టీసీ బస్సు వృద్ధురాలిని ఢీకొంది. ఈ ప్రమాదంలో గంగులమ్మ చెయ్యి నుజ్జునుజ్జు కావడంతో వెంటనే కదిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స చేశారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించినట్లు ఔట్ పోస్టు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

నూతన సంవత్సర శుభాకాంక్షలు


ఎమ్మెల్యేలు శ్రీధర్‌రెడ్డి, సిద్దారెడ్డి

పుట్టపర్తి టౌన్/కదిరి: ప్రజలకు ఎమ్మెల్యేలు దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, పీవీ సిద్దారెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. 2024 సంవత్సరం అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాక్షించారు. కొత్త సంవత్సరంలో వర్షాలు సమృద్ధిగా కురిసి, పాడి పంటలు బాగా పండాలని దేవుడిని వేడుకున్నారు. యువత, మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందజేస్తున్న సంక్షేమ పథకాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు మాజీ మంత్రి షాకీర్, మాజీ ఎంపీ కర్నల్ నిజాముద్దీన్, మక్బూల్ అహ్మద్, పూల శ్రీనివాసరెడ్డి, బత్తల హరి ప్రసాద్, వాల్మీకి పవన్‌కుమార్‌రెడ్డి, ఎస్ఎండీ ఇస్మాయిల్, సాదత్ అలీఖాన్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

3 నుంచి పింఛన్ల పంపిణీ

బత్తలపల్లి: ప్రతి నెలా వృద్ధులు, దివ్యాంగులు, వితంతు, ఒంటరి మహిళలకు అందజేస్తున్న సామాజిక భద్రత పింఛన్ల సొమ్మును ఈనెల 3వ తేదీ నుంచి పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ సాయి మనోహర్ ఆదివారం తెలిపారు.